COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: విజయవాడ,

తేది : 09.07.2019.

**కౌలు రైతులకు రక్షణ కల్పించే విధంగా "2011 కౌలురైతుల చట్టం" సవరణలు ఉండాలి.**

రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ(యం) విజ్ఞప్తి

కౌలురైతులకు వైయస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింప చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ముదావహం. అయితే కౌలు రైతుల గుర్తింపు కోసం భూయజమాని, కౌలురైతుల మధ్య ఒప్పందం తప్పనిసరి చేస్తూ"2011కౌలురైతుల చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునః పరిశీలించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరుతుంది. 1956 కౌలురైతుల చట్టంలో చాలా రకాల హక్కులు కల్పించిబడినప్పటికీ భూయజమాని కౌలు అంగీకార పత్రం ఉండాలన్న నిబంధన కారణంగా కౌలురైతులకు న్యాయం జరగలేదు. గత కాలంలో భూ యజమానులు ఎవరు రాతపూర్వకంగా కౌలు ఒప్పందం చేసుకునేందుకు ముందుకు రాలేదు. భూయజమానులకు వ్యవసాయేతర అవకాశాలు ముందుకు రావడంతో తమ భూములను కౌలుకు ఇవ్వటం పెరిగింది. ఇప్పటి వరకు వ్యవసాయ కూలీలుగా ఉన్నవారు, చేతివృత్తులలో ఉన్నపేదలు భూములను కౌలు తీసుకుని సాగు చెయ్యడం కూడా పెరిగింది. అందువల్ల గ్రామసభల వాంగ్మూలం ఆధారంగా అక్కడికక్కడే కౌలుదార్లను నమోదు చేసి గుర్తింపు కార్డులివ్వాలని కోరుతున్నాం.

మన రాష్ట్రంలో 70 శాతం భూమిలో కౌలురైతులే పంటలు పండిస్తున్నారు. 26 లక్షల మంది కౌలుదార్లు ఉన్నారు. కానీ ప్రభుత్వం 6 లక్షల మందే ఉన్నట్లుగా చెబుతున్నది. వ్యవసాయ రంగం పరిరక్షించబడాలన్నా, ఆహార భద్రత ఇబ్బంది లేకుండా చూడాలన్నా కౌలురైతులను ఆదుకోవాలని ప్రొఫెసర్ రాధాకృష్ణ రైతు అధ్యయన కమిషన్ సిఫార్సులు చేసింది. ఈ పరిస్థితిలో భూయజమాని ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా కౌలురైతులను గుర్తించి వారికి అన్ని రకాల హక్కులు కల్పించే విధంగా "2011కౌలురైతుల చట్టం" వచ్చింది. ఈ చట్టం ప్రకారం రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖలు గ్రామసభలు నిర్వహించి కౌలురైతులకు రుణ అర్హత కార్డులు ఇచ్చి పంట రుణాలతోపాటు ఇతర అన్నిరకాల వ్యవసాయ సబ్సిడీ పథకాలు వర్తించే విధంగా నిర్ణయించబడింది. ఈచట్టం ప్రకారం కౌలురైతులకు న్యాయం చెయ్యకుండా చట్టంలో లేని అంశాలను ముందుకు తెచ్చి గత ప్రభుత్వాలు కౌలురైతులకు అన్యాయం చేశాయి. ఇప్పటికీ సాగుచేయని వారికే పంటరుణాలతోపాటు అన్ని రకాల సబ్సిడీలు ఇచ్చారు. దీనితో వాస్తవ సాగుదారులైన కౌలురైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగుచేయడం వలన ఉత్పత్తి ఖర్చులు పెరిగి మరియు మార్కెట్లో పంటలకు ధరలు లేక తీవ్ర నష్టాలకు గురై పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో కౌలు రైతులే అధికం. "2011కౌలురైతుల చట్టాన్ని" సక్రమంగా అమలు చేసినట్లైతే ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదు.

రుణ అర్హత కార్డులిచ్చి బ్యాంకులు సకాలంలో పంట రుణాలిచ్చే విధంగా చట్టంలో మార్పులు చేయాలని, కౌలు రైతుల రుణాలకు ముందుగా ఒక నిర్దిష్ట సమయం కేటాయించి దరఖాస్తులు తీసుకున్నాక, ఇతర స్వంత కమతందార్ల వద్ద రుణ దరఖాస్తులు తీసుకోవాలని భావిస్తున్నాం. ఈ ప్రక్రియనంతా ఒక టైంటేబుల్ ద్వారా అమలు చేయాలని, తద్వారా కౌలురైతులకు న్యాయం చేయొచ్చని భావిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ నిర్ణయం తీసుకోబోయేముందు సంబంధిత తరగతుల ప్రతినిధులతో సంప్రదించాలని కోరుతున్నాం.

(పెనుమల్లి మధు)
రాష్ట్ర కార్యదర్శి